క్లుప్తంగా

గోదాదేవికి ప్రత్యేక పూజలు


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కడియం: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని దుళ్లలోని భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్‌కు ఆదరణ


మెప్మా అర్బన్ బజార్‌లో ఏర్పాటు చేసిన స్టాల్

రాజమహేంద్రవరం సిటీ: స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులతో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మెప్మా సిటీ మిషన్ డీఆర్పీ శ్రీలలిత అన్నారు. మహిళలు స్వయంగా తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా వారిని ఆర్థికంగా ప్రోత్సహించే అవకాశం ఉంటుందన్నారు. నగరంలోని పుష్కరఘాట్ వద్ద ప్రతి నెలా రెండో గురు, శుక్రవారాల్లో ఈ బజార్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో వివిధ పచ్చళ్లు, చీరలు, చేనేత, హస్తకళల బొమ్మలు, వైరు బుట్టలు, జూట్ బ్యాగులు, పంజాబీ డ్రెస్సులు తదితర వాటిని విక్రయిస్తున్నట్లు తెలిపారు.తక్కువ ధరకు లభ్యమయ్యే వస్తువులను కొనుగోలు చేయిడం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులను ప్రోత్సహించాలని ప్రజలకు లలిత విజ్ఞప్తి చేశారు.

హైస్కూల్‌కు వాటర్ క్యాన్ల వితరణ


పాఠశాలకు అందించిన వాటర్ క్యాన్లు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు, గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గొందేశి శ్రీనివాసులు రెడ్డి జన్మదినం సందర్భంగా కూలింగ్ వాటర్ క్యాన్లను అందించారు. చేనేత కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కుర్మా మల్లికార్జునప్రసాద్ సౌజన్యంతో వీటిని ప్రధానోపాధ్యాయురాలు ఈశ్వరి, ఉపాధ్యాయులకు అందించారు.

నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలి


కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ పిలుపునిచ్చారు. స్థానిక 47వ డివిజన్ సిద్ధార్థ నగర్‌లో నిర్మించిన వైఎస్సార్ కమ్యూనిటీ హాలును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరినీ సమైక్య పరిచేందుకు ఇటువంటి సామాజిక భవనాలు వేదిక అవుతాయన్నారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, క్లస్టర్ అధ్యక్షుడు అజ్జరపు వాసు, మాజీ కార్పొరేటర్లు మానే దొరబాబు, చోడిశెట్టి సత్యవాణి పాల్గొన్నారు.

కార్యాచరణ పరిశోధనపై శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణాసంస్థ (డైట్)లో గురువారం స్మాల్‌స్కేల్/యాక్షన్ రీసెర్చ్‌పై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ ప్రారంభించారు. కార్యశాల నిర్వహణలో భాగంగా తొలిరోజు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పరిశోధనా పద్ధతులు, సమాచార సేకరణ సాధనాలు తదితర వాటిని వివరించారు. కార్యాచరణ పరిశోధన, అందలి సోపానాలను డైట్ అధ్యాపకులు కేవీ సూర్యనారాయణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 93 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కోర్స్ కో ఆర్డినేటర్‌గా డి.సుజాతారత్నం, విషయ నిపుణులుగా రమణ, సూర్యనారాయణ వ్యవహరించారు.

నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ భరత్ రామ్
- అధికారులకు సూచనలు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ నగర పాలక సంస్థ సంబంధిత విభాగం అధికారులకు ఆదేశించారు. స్థానిక 45వ డివిజన్‌లో గురువారం ఆయన గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ రామ్ క్షేత్రస్థాయిలో సమస్యలు, సంక్షేమ పథకాలు అమలు తీరుపై లబ్ధిదారులతో మాట్లాడారు. డ్రైనేజీలో మురుగు నీరు నిలిచిపోయి ఉండటాన్ని గమనించి, దాన్ని శుభ్రం చేయించాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. గోదావరిని ప్రక్షాళన చేయడం, నగర ప్రజలకు పరిశుద్ధమైన తాగునీరు అందించడమే తన లక్ష్యమన్నారు. గత టీడీపీ పాలకుల అనాలోచిత చర్యల కారణంగా కొన్ని సమస్యలు దీర్ఘకాలికంగా తిష్టవేశాయన్నారు. వాటిలో ప్రధానంగా మురుగు నీటిని పూర్తి స్థాయిలో శుద్ధి చేయకుండా గోదావరిలో వదలడమేనన్నారు. ప్రజలకు తాగునీటిని అందించే నల్లా ఛానల్ వద్దే మురుగు నీటి శుద్ధిచేసే ప్రక్రియ జరగడం వల్ల ప్రజలు డయేరియా తదితర అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ప్రజలు ఆశీర్వదించి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానన్నారు. ఎంపీగా ఉన్నప్పుడే ఎక్కువ సమయం ప్రజల మధ్య గడిపానని, అదే ఎమ్మెల్యే అయితే రాజమహేంద్రవరాన్ని విశ్వనగరంగా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ భరత్ రామ్

క్రీడలలో యువత రాణించాలి

యువత క్రీడలలో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో గుర్తింపు పొందాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆకాంక్షించారు. లాలా చెరువు నుంచి క్వారీ సెంటర్ రోడ్డు వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద క్రీడా మైదానంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు ఏర్పాటు చేసిన అజ్జరపు లక్ష్మీసుందరరావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్–2024ను ఆయన ప్రారంభించారు. ఏటా అజ్జరపు వాసు, మిత్ర బృందం ఈ పోటీలను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. యువత క్రీడలలో సాధన చేసేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తానని, ఇండోర్ స్టేడియం నిర్మిస్తానని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మానే దొరబాబు పాల్గొన్నారు.

సంతకాలు చేసి బానిసలు కాకండి

అధికారాన్ని అడ్డుపెట్టుకుని చిట్‌ఫండ్ పేరుతో చీటింగ్ చేసే వడ్డీ వ్యాపారులను ఎమ్మెల్యేలుగా ఎన్నుకోవద్దని, వారు మన సంతకాలతో బానిసలుగా మార్చేస్తారని టీడీపీ నాయకులపై భరత్ రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 ఏళ్ల పాటు మేయర్లుగా, ఎమ్మెల్యేలుగా టీడీపీ నాయకులు ఉన్నా, నగరానికి చేసిందేమీ లేదన్నారు. గత పుష్కరాలకు అభివృద్ధి పేరుతో రూ.2 వేల కోట్లు మంజూరు అయితే, ఆ సొమ్మంతా దోచుకుతిన్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన ఈ నాలుగున్నరేళ్లలో కేవలం రూ.400 కోట్లతో నగరం రూపురేఖలు మార్చి, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించామన్నారు. ప్రతి పైసా నగర అభివృద్ధికే వెచ్చించామన్నారు. అభివృద్ధి కావాలో, అరాచకం సృష్టించే వాళ్లు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం కాకుండా అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. అనంతరం మటన్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎంపికైన ఎస్‌కే కరీముల్లా, ఉపాధ్యక్షుడు సక్కా రాజశేఖర్, కార్యదర్శి ఎస్‌కే మాలు, జాయింట్ సెక్రటరీ ఎస్‌కే బిలాల్, ఎస్‌కే దావీద్ తదితర పాలకవర్గ సభ్యులను రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావుతో కలసి అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, గుర్రం గౌతం, మజ్జి అప్పారావు, హబీబుల్లా ఖాన్, ఆరిఫ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ మరమ్మతుల కోసం శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 6.30 నుంచి 9.30 వరకూ వీఎల్‌పురం, వీఎల్ పురం పార్క్ వీధులు, చైతన్య కాలేజ్ వీధి, వీఎల్ పురం పెద్ద వీధి, ఆదర్శ హాస్పిటల్ రోడ్డు, వాసిరెడ్డి రాంబాబు వీధి, చక్రధర్ హాస్పిటల్ ఏరియా, తిలక్ రోడ్డు, ఏవీ అప్పారావు వీధి, ఆదిరెడ్డి అప్పారావు వీధి పరిసర ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మహాలక్ష్మి టెంపుల్ వీధి, వాకర్స్ రోడ్డు, ఏవీ అప్పారావు రోడ్డు, మహాలక్ష్మి గుడి వీధులు, కాంచన నగర్, ఎస్‌బీఐ కాలనీ, వెంకటేశ్వర నగర్, వాకర్స్ పార్క్ ఎదురుగా వీధులు, డీవీబీ రాజు సెక్టర్ 62 ఫ్లాట్లు, ఆక్సిజన్ టవర్లు, సుక్షేత్ర అపార్ట్‌మెంట్లు పరిసర ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.
- ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ కృష్ణానగర్, కొత్త రోడ్డు, రామచంద్రరావు పేట, కోర్లం పేట, సాంబశివరావుపేట ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుంది.

ఆడపిల్లల రక్షణ సమష్టి బాధ్యత

కడియం: ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎంఈవో నాగేశ్వరరావు అన్నారు. స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగిన బాలికల సంరక్షణ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో పలు పోటీలు నిర్వహించారు. హైస్కూలు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. వ్యాసరచనలో కడియానికి చెందిన జి.విజయలక్ష్మి ప్రథమ, వీరవరానికి చెందిన కె.యశ్వంత్ ద్వితీయ, జేగురుపాడుకు చెందిన పి.సువర్ణ తృతీయ స్థానాలు సాధించారు. వక్తృత్వంలో వీరవరానికి చెందిన సీహెచ్‌వీడీ మణికంఠ ప్రథమ, కడియానికి చెందిన టి.హేమ ద్వితీయ, జేగురుపాడుకు చెందిన వరలక్ష్మి తృతీయ స్థానాల్లో నిలిచారు. చిత్రలేఖనంలో ఓదూరి గౌతమీ నవ్యశ్రీజాత ప్రథమ, దిలీప్ ద్వితీయ, కార్తికేయ తృతీయ స్థానాలు సాధించారని పోటీల నిర్వాహకులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ తెలిపారు. మండల స్థాయిలో విజేతలు జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. ఉపాధ్యాయులు షేక్ ఇమామ్, ప్రసన్నకుమారి, సువర్ణవేణి, రాజు పాల్గొన్నారు.


విజేతలతో ఎంఈవో నాగేశ్వరరావు

ఓటు సురక్షితం.. అపోహలు వీడుదాం

- అనుమానాలు నివృత్తి చేస్తున్న ఎన్నికల సిబ్బంది
- వీవీ ప్యాట్‌లతో అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: ఓటు వేసిన వారిలో ఒకటే సందేహం... తాను వేసిన ఓటు వాళ్లకే పడిందా, బటన్ ఒకచోట నొక్కితే మరొకరికి పడిందా, మన ప్రమేయం లేకుండా ఓట్లన్నీ గుంపగుత్తగా ఏదో ఒక పార్టీకే పడిపోయాయా.. ఇలా వేసిన ఓటుపై ఓటర్లలో అనేక సందేహాలు ఏర్పడడం సర్వసాధారణమైంది. కొన్ని రాజకీయ పార్టీలు అవగాహన లేక చేసే విమర్శల వల్ల ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల పనితీరుపై అనేక అపోహలు కలుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఓటు దుర్వినియోగం కాదని తెలియజెప్పే ప్రయత్నం చేస్తోంది ఎన్నికల కమిషన్.

వీవీ ప్యాట్‌లతో నివృత్తి

బ్యాలెట్ యూనిట్‌పై నచ్చిన అభ్యర్థికి ఓటు వేసిన వెంటనే పక్కనే ఉన్న ఓటర్ వెరిఫబుల్ పేపర్ ఆడిట్ ట్రిమ్ (వీవీ ప్యాట్) సందేహాన్ని నివృత్తి చేస్తుంది. ఓటు వేసిన ఏడు సెకండ్ల వరకు వీవీ ప్యాట్‌లో ఎవరికి వేశామో ఆ నంబర్‌ను స్క్రీన్‌పై స్పష్టంగా నిర్ధారించి చూపిస్తుంది. ఒకరికి ఓటు వేస్తే వేరొకరికి వెళితే అక్కడే తేటతెల్లమైపోతుంది. ఇది నిర్ధారణ చేసుకుని ఓటరు బయటకు వెళ్లేందుకు వీవీ ప్యాట్ ఎంతో ఉపయోగపడుతుంది.

విస్తృత ప్రచారం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం, వీవీ ప్యాట్ పనితీరుపై విస్తృత ప్రచారం చేపట్టారు.


ధవళేశ్వరంలో ట్రాన్స్‌జెండర్లకు వీవీ ప్యాట్‌పై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ పైడి చిన్నారావు (ఫైల్)

కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన మెషీన్లను ఏర్పాటు చేశారు. రూరల్, అర్బన్ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ నేతృత్వంలో వీవీ ప్యాట్, ఈవీఎంలను రోజుకొక పోలింగ్‌స్టేషన్ వద్ద ఉంచి ప్రజలతో స్వయం పరీక్షించి నిర్ధారించేలా అవగాహన కల్పిస్తున్నారు. ఈ విధానానికి ప్రజల్లో మంచి స్పందన కనిపిస్తోందని అక్కడ ఉన్న బీఎల్‌వోలు చెబుతున్నారు. అర్బన్‌లోని 232, రూరల్ లోని 264 పోలింగ్ బూత్‌ల్లో ఫిబ్రవరి నెలాఖరు వరకూ అవగాహన కల్పించనున్నారు.

సందేహాల నివృత్తికే..

వేసిన ఓటుపై ఓటరుకు ఉండే సందేహాలను నివృత్తి చేసేందుకు వీవీ ప్యాట్ ఎంతో ఉపయోగపడుతోంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్టిన వీవీ ప్యాట్‌లో వివిధ పనులపై వచ్చే ప్రజలు స్వయంగా పరీక్షించుకుని నిర్ధారణ చేసుకుంటున్నారు. వాస్తవాన్ని తెలుసుకున్నాక ప్రజల్లో కూడా వీటి పనితీరుపై అపోహలు తొలుగుతున్నాయి. వీటి ద్వారా నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ బూత్‌ల్లో ఫిబ్రవరి నెలాఖరు వరకూ విస్తృత ప్రచారం చేస్తాం.

– పైడి చిన్నారావు, తహసీల్దార్, రాజమహేంద్రవరం రూరల్

బ్రెయిలీ సేవలు స్ఫూర్తిదాయకం

సీటీఆర్ఐ: బ్రెయిలీ లిపి ద్వారా అంధులకు జీవితం ప్రసాదించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కలెక్టర్ మాధవీలత కొనియాడారు. బ్రెయిలీ జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో ఆయనకు ఎస్పీ పి.జగదీష్, అంధ ఉద్యోగి పి.రామలక్ష్మితో కలిసి నివాళులర్పించారు. అనంతరం 2024 బ్రెయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నేటి ఆధునిక ఆవిష్కరణలకు స్ఫూర్తి ప్రదాత లూయిస్ బ్రెయిలీ అన్నారు. బ్రెయిలీ లూయిస్ బతికుండగా ఈ లిపి గురించి ఎవరూ పట్టించుకోలేదన్నారు. కానీ ఆయన మరణించిన రెండేళ్లకే 1854లో లూయిస్ రూపొందించిన ఆల్ఫాబెట్ సిస్టమ్‌ను ఫ్రెంచి ప్రభుత్వం గుర్తించి, అక్కడి అంధ విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. నాడు బ్రెయిలీ సృష్టించిన లిపికి 1982లో ఎలక్ట్రానిక్ బ్రెయిలీ డిస్‌ప్లే, తదుపరి ఎలక్ట్రానిక్ నోట్స్, డిజిటల్ ఆడియో బుక్స్, కంప్యూటర్ స్క్రీన్ రీడర్స్, వాయిస్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్, డిజిటల్ లైబ్రరీలు ఎన్నో నూతన ఆవిష్కరణలకు నాంది పలికింది అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, జిల్లా దివ్యాంగుల శాఖ పర్యవేక్షకుడు బి.నాగభూషణం, దివ్యాంగుల సంక్షేమం, దృశ్య లోప ప్రతిభావంతులు సంఘం ప్రతినిధి ఎన్.రామలక్ష్మి పాల్గొన్నారు.


బ్రెయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

6న స్వర్ణాంధ్ర సేవాసంస్థ రజతోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ రజతోత్సవాన్ని శనివారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో జరపనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఈ మేరకు గురువారం రజతోత్సవ బ్రోచర్‌ను వృద్ధుల మధ్య ఆవిష్కరించారు. రాంబాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి నగర ప్రముఖులు, సేవాతత్పరులు హాజరవుతారన్నారు. దాతలకు సత్కారం, సర్వమత ప్రార్థనలు, సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రజతోత్సవం సందర్భంగా వచ్చే సంవత్సరం జనవరి 6 వరకూ నెలకు ఒక కార్యక్రమం చొప్పున సేవా మహోత్సవం నిర్వహిస్తామన్నారు. ప్రతి నెలా 25 మందికి లబ్ధి చేకూరే విధంగా 12 నెలల్లో 300 మందికి వివిధ సేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ, సూపర్ వైజర్ ఇలియాస్ పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న గుబ్బల రాంబాబు

విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి

కంబాలచెరువు: రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీనివాస రామానుజన్ మున్సిపల్ హైస్కూల్లో గురువారం రాజమహేంద్రవరం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి విద్యార్థులతో మాట్లాడుతూ చదువుపై ఆసక్తి కలిగి ఉండాలని, నిరంతరం వివిధ విషయాలపై పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. మంచి, చెడు స్పర్శల గురించి వారికి వివరించారు. నల్సా వారి పిల్లలకు స్నేహపూర్వక న్యాయ సేవలు, సంరక్షణ పథకం–2015 ద్వారా పిల్లలకు అందిస్తున్న న్యాయసేవలను తెలిపారు. పిల్లలకు ఎలాంటి న్యాయ సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. అనంతరం అక్కడి పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు.


సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

బొబ్బిల్లంక హైస్కూల్లో స్టాండర్డ్ క్లబ్

సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ క్లబ్ ప్రారంభమైందని ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వినియోగ వ్యవహారాల మంత్రిత్వశాఖ దీనిని మంజూరు చేసిందన్నారు. ఈ క్లబ్ ద్వారా విద్యార్థులకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ కార్యక్రమాలపైనా, వస్తువుల స్వచ్ఛతా ప్రమాణాలను తెలుసుకోవడానికి అనుసరించాల్సిన విధానాలపైనా పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. క్లబ్ కార్యక్రమాల్లో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. స్టాండర్డ్ పరీక్షా విధానంపై జిల్లా రిసోర్స్ పర్సన్ బి.ఆంజనేయులు ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించి, విజేతలకు నగదు బహుమతి అందజేశారు.

అయోధ్య అక్షతల ఊరేగింపు

సీతానగరం: అయోధ్య రామయ్య మందిర తీర్థక్షేత్ర ట్రస్ట్ అందించిన అక్షతలను గురువారం కాటవరంలో పల్లకీపై ఊరేగించారు. గ్రామంలోని రామాలయం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. బీజేపీ రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి భక్తులకు అక్షతలు అందించారు. కార్యక్రమంలో గూడపటి జయరామ్, బూరుగుపల్లి బంగారయ్య, సమరసత ఫౌండేషన్ డివిజన్ ఇన్‌చార్జి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని సుభద్రంపేటలో అయోధ్య రామ మందిర నిర్మాణ పూజ అక్షతలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.సాయిరాం, గ్రామ పెద్దలు కూటి సాయిబాబు, పేపకాయల రామచంద్రరావు, పూసల సత్యనారాయణ, కోసూరి సత్యనారాయణ, పేపకాయల వీరభద్రరావు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కడియం: కడియం– వీరవరం రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన జరిగింది. ప్రతి ఏటా ఇక్కడ అమ్మవారి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ముగింపు రోజున భక్తుల సహకారంతో అన్నదానం చేస్తారు. అందులో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

మున్సిపల్ కార్మికుల మానవహారం

రాజమహేంద్రవరం సిటీ: సమస్యల పరిష్కారం కోసమే మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నారని మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కోరుమామిళ్ల సుబ్బారాయుడు అన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం మున్సిపల్ కార్మికులతో మానవహారం నిర్వహించి, నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇద్దరు మున్సిపల్ కార్మికులకు అధికారులతో షోకాజ్ నోటీసులు ఇచ్చి భయపెట్టాలని చూస్తున్నారన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు తాటిపాక మధు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కుంద్రపు రాంబాబు పాల్గొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు గ్రామంలో గురువారం నిర్వహించిన దాడులలో 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ సీఐ పీవీ రమణ తెలిపారు. ఖాళీ ప్రదేశంలో బొర్రా సూరిబాబును అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. పక్కనే తుప్పల్లో 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే సూరిబాబు ఇంటి వద్ద ఎస్ఈబీ పోలీస్ టీమ్ సీఐ అప్పారావు సోదాలు నిర్వహించగా 20 లీటర్ల సారా లభించిందన్నారు. సూరిబాబును అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సినిమాలు

శ్యామల	: డెవిల్
సూర్యమినీ	: ఆక్వామేన్
సూర్యప్యాలెస్	: యానిమల్
స్వామి	: హాయ్‌నాన్న
శివజ్యోతి	: మాయాబజార్
అనుశ్రీ	: డెవిల్
రాజా	: సలార్
అశోక	: సలార్
ఊర్వశి	: డెవిల్
రంభ	: బబుల్ గమ్
మేనక	: ఆక్వామేన్
అప్సర	: కపాలదీవి
నామవరం	
వీఎస్ మహల్	: సలార్, డెవిల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: డెవిల్
కడియం	
వెంకటసూర్య	: సలార్, డెవిల్

మర్యాదపూర్వకంగా..

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ప్రభుత్వ సామాజిక న్యాయసలహాదారుడు జూపూడి ప్రభాకరరావును పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు సుందరపల్లి అనిల్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూపూడి మాట్లాడుతూ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేసి రాబోయే ఎన్నికలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. సిరింగి రత్నకుమార్, కుమారి చిన్న పిచ్చయ్య, కొల్లి చిన్న, మోతా మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


జూపూడి ప్రభాకరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అనిల్

పేదలకు అండగా సీఎం జగన్


కూనవరంలో పింఛన్ అందజేస్తున్న నాయకులు


కణుపూరు సచివాలయంలో పింఛన్ల పంపిణీ

సీతానగరం: రాష్ట్రంలోని పేదలందరికీ సీఎం జగన్ అండగా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మండలంలోని కూనవరం సచివాలయంలో గురువారం పెన్షన్ వారోత్సవం ఘనంగా నిర్వహించారు. పింఛన్ రూ.2750 నుంచి రూ.3 వేలు పెరిగిన నేపథ్యంలో లబ్ధిదారులతో కలిసి సర్పంచ్ సుంకర గంగాలక్ష్మి, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, పార్టీ నాయకులు ఈ వారోత్సవాలు నిర్వహించారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: మండలంలోని గ్రామాల్లో గురువారం పింఛన్ల పండగ నిర్వహించారు. పింఛన్లను రూ.2750 నుంచి రూ.3 వేలకు సీఎం జగన్ పెంచిన నేపథ్యంలో గ్రామాల్లో సందడి నెలకొంది. కోరుకొండ మండలంలో ప్రస్తుతం 12,582 మందికి నెలకు రూ.3 వేలు చొప్పున నగదు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలోని సచివాలయాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు.